అక్షర దర్బార్
Voice of the people
www.aksharadarbar.com

ఏరియా ఆసుపత్రిని త్వరగా

## అందుబాటులోకి తీసుకురావాలి

- ఆసుపత్రి నిర్వహణలో పారదర్శకత ఉండాలి
- ఎమ్మెల్యే రేవూరి
- అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సమీక్ష

03



శుక్రవారం 12, జూన్ 2026 సంపుటి :03 సంచిక :122 పేజీలు :05 వెల ₹5



# ప్రభుత్వ బడికి పన్ను ఊరట

- మైసంపల్లి పంచాయతీ వినూత్న తీర్మానం
- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికే ఈ ముందడుగు
- పిల్లలను చేర్పించే తల్లిదండ్రులకే ప్రభుత్వ పథకాల్లో ప్రథమ ప్రాధాన్యత
- జిల్లాలోనే మొట్టమొదటి వినూత్న కార్యక్రమం:సర్పంచ్ వేముల ఇందిరా దేవి

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మైసంపల్లి గ్రామపంచాయతీ ఒక అద్భుతమైన, వినూత్నమైన నిర్ణయాన్ని తీసుకుంది. గ్రామ ప్రభుత్వ పాఠశాలలో (యూపీఎస్) తమ పిల్లలను చదివించే తల్లిదండ్రులకు 'ఇంటి పన్ను' పూర్తిగా మినహాయిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ వేముల ఇందిరా దేవి ప్రకటించారు. గురువారం మైసంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ అత్యవసర సమావేశంలో ఈ మేరకు చారిత్రాత్మక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. జిల్లాలోనే ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఇదే ప్రథమం కావడం విశేషం. – అక్షరదర్బార్, దుగ్గొండి

02

## వారియర్స్ కప్ కొడితే నా నెల జీతం ఇస్తా

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- ఘనంగా 'వరంగల్ వారియర్స్' గ్రీట్ అండ్ మీట్
- జట్టుకు పూర్తి అండగా ఉంటాం.. ఆర్ట్స్ కాలేజీలో ప్రాక్టీస్ వసతులు

02



అనుమానాస్పద

## ఆపరేషన్..

రికార్డులు స్వాధీనం

- ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ
- ఆపరేషన్ థియేటర్ సీజ్

02

## ఆలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

- విద్యార్థులను తరలించే స్కూలు బస్సులను తనిఖీ చేయాలి
- నేపాల్ పౌరుల వివరాలను సేకరించాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



అక్షర దర్బార్

# వారియర్స్ కప్ కొడితే నా నెల జీతం ఇస్తా

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- ఘనంగా 'వరంగల్ వారియర్స్' గ్రీట్ అండ్ మీట్
- జట్టుకు పూర్తి అండగా ఉంటాం.. ఆర్ట్స్ కాలేజీలో ప్రాక్టీస్ వసతులు



అక్షరదర్బార్, హనుమకొండ: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధితో పాటు క్రీడలకు కూడా పెద్దపీట వేస్తోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు. గురువారం హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో టీజీ-20 క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా 'వరంగల్ వారియర్స్' జట్టు గ్రీట్ అండ్ మీట్ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో పాటు యువ నాయకులు విష్ణు రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

**- కప్ సాధిస్తే ప్రత్యేక ప్రోత్సాహకం**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యేగా క్రీడాకారులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. టీజీ-20 టోర్నమెంట్‌లో వరంగల్ వారియర్స్ జట్టు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి, వరంగల్ పేరు రాష్ట్రవ్యాప్తంగా మారుమోగేలా కప్‌ను సాధించాలని ఆకాంక్షించారు. "వరంగల్ వారియర్స్ జట్టు టీజీ-20 టోర్నమెంట్ విజేతగా నిలిచి కప్‌ను సాధిస్తే.. నా ఒక నెల ఎమ్మెల్యే జీతాన్ని జట్టుకు ప్రోత్సాహకంగా అందజేస్తా" అని ఎమ్మెల్యే నాయిని ఈ సందర్భంగా సంచలన ప్రకటన చేశారు. అంతేకాకుండా, క్రీడాకారులు స్థానికంగా ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ప్రాక్టీస్ చేసుకునే విధంగా జిల్లా అధికార యంత్రాంగంతో మాట్లాడానని, అక్కడ అన్ని రకాల వసతులు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

**- యువత ఉన్నత శిఖరాలను అధిరోహించాలి**

యువ నాయకులు విష్ణు రెడ్డి మాట్లాడుతూ.. యువ క్రికెటర్లకు అద్భుతమైన ప్రోత్సాహం అందిస్తున్న వరంగల్ వారియర్స్ జట్టు యాజమాన్యం కృషిని అభినందించారు. క్రీడా రంగంలో వరంగల్ యువత మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ఉత్సాహభరిత కార్యక్రమంలో వరంగల్ వారియర్స్ టీమ్ కో-ఓనర్స్ ఫణి చిత్తినేని, వరుణ్ జూపల్లి, ధీరజ్ ఇందూరులతో పాటు జట్టు కోచ్, జట్టు సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఆలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

- విద్యార్థులను తరలించే స్కూలు బస్సులను తనిఖీ చేయాలి
- నేపాల్ పౌరుల వివరాలను సేకరించాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్




అక్షరదర్బార్, హనుమకొండ: నిర్వహించాల్సిన విధులను నిర్వహించకుండా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని గురువారం కిట్స్ కళాశాల సమావేశ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సమావేశంలో తొలిసారి గతంలో ఎన్నడు లేని విధంగా సీసీటీఎన్ఎస్ అప్లికేషన్ 2.0 ద్వారా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, కేసుల దర్యాప్తు, నేర నియంత్రణ కోసం సంబంధిత పోలీస్ అధికారులు తీసుకుంటున్న చర్యలపై సీపీ అన్ లైన్ పద్దతిలో సంబంధిత స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల, కేసుల పురోగతికి తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్ కమిషనర్ అధికారులకు సూచనలు, సలహాలను అందజేశారు.

అనంతరం అధికారులను ఉద్దేశించి సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లను స్టేషన్ అధికారులు వ్యక్తిగతంగా వెళ్ళి తనిఖీ చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో విద్యా సంస్థలకు 100 మీటర్ల పరిధిలో ఎలాంటి పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని, రానున్న విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకోని విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులను పాఠశాలలకు తరలించే స్కూల్ బస్‌ల స్థితిగతులపై స్థానిక పోలీస్ అధికారులు వ్యక్తిగతంగా వెళ్ళి బస్సులను తనిఖీ చేయాలని అన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన వరుస సంఘటనలను దృష్టిలో ఉంచుకొని నగరంలో నేపాల్ దేశానికి చెందిన పౌరులు ఎక్కడ పనిచేస్తున్నారు, ఎక్కడ నివస్తున్నారు, ముఖ్యంగా ఇండ్లల్లో పనిచేసే వారి వివరాలను సేకరించాలని చెప్పారు. రాబోవు లోక్ ఆదాలత్ ద్వారా పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యే విధంగా అధికారులు కృషి చేయాలని, పెండింగ్ కేసులను పరిష్కరించడంతో పాటు, పెండింగ్ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను త్వరగా పరిష్కరించాలని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీసీపీలు అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్, దార కవిత, అదనపు డీసీపీలు రవి, బాలస్వామి, ప్రభాకర్ రావు, సురేష్‌కుమారతో పాటు ఏసీపీలు, ఇన్ స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

## క్రీడల్లో యువతరం రాణిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలి

### క్రీడాకారులకు క్రికెట్ కిట్ ను అందజేసిన బిల్లా మాధవరెడ్డి

అక్షర దర్బార్ చిట్యాల : క్రీడల్లో యువతరం రాణిస్తూ ఉన్నతంగా ఎదగాలని కోరుతూ చిట్యాల మండలంలోని నవాబుపేట గ్రామంలోని క్రీడాకారులకు అదే గ్రామానికి చెందిన కోల్ ఇండియా సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు బిల్లా మాధవరెడ్డి క్రీడాకారులకు గురువారం క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు, క్రీడాకారులు మాధవరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల అభివృద్ధికి ఇటువంటి సహకారం ఎంతో ఉపయోగపడుతుందని క్రీడాకారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సారయ్య, నాయకులు సాదరాజు, సర్వ శరత్, వల్లబోజు నరేష్, గ్రామ పెద్దలు, గ్రామ యువకులు పాల్గొన్నారు.



# ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ

- అనుమానాస్పద ఆపరేషన్.. రికార్డులు స్వాధీనం
- ఆపరేషన్ థియేటర్ సీజ్

అక్షరదర్బార్, గూడూరు: గూడూరు మండల కేంద్రంలోని 'తిరుమల నర్సింగ్ హోమ్' ప్రైవేట్ ఆసుపత్రిపై గురువారం మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ రవి రాథోడ్ తన బృందంతో కలిసి అకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రిలో అనుమానాస్పద రీతిలో గర్భస్రావం జరిగినట్లు వచ్చిన సమాచారంతో అధికారులు ఈ దాడులు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పుల్లయ్యబోడు తండాకు చెందిన లావుడియా జ్యోతిక (భర్త గణేష్) అనే మహిళకు ఇక్కడ అనుమానాస్పద స్థితిలో కుటుంబ నియంత్రణ (ట్యూబెక్టమీ) ఆపరేషన్ జరిగినట్లు అధికారులు గుర్తించారు. దీనికి సంబంధించి ఆసుపత్రి రికార్డులను, కేసు షీట్లను, ఇతర కీలక పత్రాలను వైద్యారోగ్య శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

**- ఆపరేషన్ థియేటర్ సీజ్..**

బాధిత మహిళ వరంగల్ జిల్లా పరిధికి చెందినది కావడంతో, ఈ కేసు గురించిన పూర్తి సమాచారం, తదుపరి చర్యల కోసం వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని సంప్రదించనున్నట్లు డాక్టర్ రవి రాథోడ్ తెలిపారు. నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో సదరు ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్ (ఓటీ)ను అధికారులు తక్షణమే సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో ఇన్‌చార్జ్ పీఓ ఎంహెచ్ఎన్ డాక్టర్ విరాజిత, డిప్యూటీ డెమో రాజ్‌కుమార్, వైద్యారోగ్య శాఖ సిబ్బంది లోక్య, ప్రశాంత్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలు పడే వరకు విత్తనాలు వేయొద్దు

- రైతులకు వ్యవసాయ శాఖ సూచన
- విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు

అక్షర దర్బార్,పరకాల: పరకాల మండలంలోని విత్తన దుకాణాల్లో గురువారం వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తన డీలర్లకు పలు సూచనలు చేశారు. రైతులకు స్పష్టంగా కనిపించేలా స్టాక్ బోర్డులు, లైసెన్స్ ప్రతులను దుకాణాల్లో ప్రదర్శించాలని ఆదేశించారు. అలాగే రైతులకు విక్రయించే విత్తనాలకు తప్పనిసరిగా బిల్లులు జారీ చేసి, వాటిపై రైతుల సంతకాలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా రైతులకు ముఖ్య విజ్ఞప్తి చేస్తూ, మండలంలో ఇప్పటి వరకు సరిపడా వర్షపాతం నమోదు కాలేదని తెలిపారు. ప్రస్తుతం 6 మిల్లీమీటర్ల వరకు కూడా వర్షం కురవకపోవడంతో నేలలో తేమ తగినంతగా లేదన్నారు. ఈ పరిస్థితుల్లో తొందరపడి పత్తి తదితర పంటల విత్తనాలు విత్తితే అధిక ఉష్ణోగ్రతల కారణంగా మొలక శాతం తగ్గే అవకాశం ఉందని హెచ్చరించారు. అందువల్ల రైతులు ఆతురపడకుండా, సరిపడా వర్షాలు కురిసి భూమిలో తేమ ఏర్పడిన తర్వాతే విత్తనాలు విత్తుకోవాలని అధికారులు సూచించారు. నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసి, బిల్లులను భద్రంగా ఉంచుకోవాలని రైతులకు సూచించారు.





# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

○ పరకాలలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ క్షేత్రస్థాయి పరిశీలన

అక్షరదర్బార్, పరకాల: హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ గురువారం పరకాల పట్టణంలో పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయం, దామెర చెరువు అభివృద్ధి పనులు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన సముదాయాన్ని సందర్శించి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న కలెక్టర్‌కు మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, కమిషనర్ పోతరాజు పవన్, ఆర్డీవో డి.ఎస్. వెంకన్న తదితరులు స్వాగతం పలికారు. అనంతరం కార్యాలయంలోని వివిధ విభాగాలు, మొక్కల నర్సరీ, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) కోసం ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం దామెర చెరువు కట్ట బండ్, నాలా, కాలువ అభివృద్ధి పనులను పరిశీలించి పనుల నాణ్యత, పురోగతిపై ఆరా తీశారు. అలాగే అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన సముదాయాన్ని సందర్శించి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ ఆరెపల్లి సుమన్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడికి పన్ను ఊరట

○ మైసంపల్లి పంచాయతీ వినూత్న తీర్మానం

○ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికే ఈ ముందడుగు

○ పిల్లలను చేర్పించే తల్లిదండ్రులకే ప్రభుత్వ పథకాల్లో ప్రథమ ప్రాధాన్యత

○ జిల్లాలోనే మొట్టమొదటి వినూత్న కార్యక్రమం: సర్పంచ్ వేముల ఇందిరా దేవి



అక్షరదర్బార్, దుగ్గొండి : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మైసంపల్లి గ్రామపంచాయతీ ఒక అద్భుతమైన, వినూత్నమైన నిర్ణయాన్ని తీసుకుంది. గ్రామ ప్రభుత్వ పాఠశాలలో (యూపీఎస్) తమ పిల్లలను చదివించే తల్లిదండ్రులకు 'ఇంటి పన్ను' పూర్తిగా మినహాయిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ వేముల ఇందిరా దేవి ప్రకటించారు. గురువారం మైసంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ అత్యవసర సమావేశంలో ఈ మేరకు చారిత్రాత్మక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. జిల్లాలోనే ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఇదే ప్రథమం కావడం విశేషం.

### ప్రభుత్వ స్కూళ్ల పరిరక్షణే మా ధ్యేయం

ఈ సందర్భంగా సర్పంచ్ వేముల ఇందిరా దేవి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న విద్యా విధానాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే తమ పాలకవర్గం లక్ష్యమని స్పష్టం చేశారు. అందులో భాగంగానే ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులకు ఇంటి పన్ను మినహాయింపు ఇస్తున్నట్లు తెలిపారు. "సర్కారు బడులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. మైసంపల్లి ప్రభుత్వ స్కూల్లో పిల్లల్ని చదివించే తల్లిదండ్రులకు ఇంటి పన్ను మినహాయింపుతో పాటు, ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలలోనూ ప్రథమ ప్రాధాన్యత ఇస్తాం." అని మైసంపల్లి సర్పంచ్ వేముల ఇందిరా దేవి అన్నారు. ఇదే సమయంలో 'ఇందిరమ్మ ప్రజా పాలన 99 రోజుల ప్రణాళిక'లో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

### వర్షా కాలం.. సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామస్థులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ సూచించారు. గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు, ప్రజలకు అవసరమైన అత్యవసర మందులను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీ కార్యాలయానికి సొంత ఖర్చులతో నూతనంగా 20 కుర్చీలను విరాళంగా అందజేసిన 5వ వార్డు సభ్యులు ఇటుకల రవిని పాలకవర్గం శాలువాతో ప్రత్యేకంగా సన్మానించి, అభినందనలు తెలిపింది. ఈ వినూత్న తీర్మాన సమావేశంలో గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ మంగ్య నాయక్, పంచాయతీ కార్యదర్శి శ్రీలత, ఏఈఓ హన్మంత్, ఉప సర్పంచ్ బొల్లంపల్లి ఆనందం, వార్డు సభ్యులు చింతం సుమలత, ఈద సురేందర్, గంగారపు రజిత, ఇటుకల రమేష్, బోయిని రజిత, కోడి విజయలత, గ్రామస్థులు పాల్గొన్నారు.



### దామెర చెరువు మత్తడి

# కాల్వను శుభ్రపరచాలి

○ మున్సిపల్ కమిషనర్‌కు 9వ వార్డు కౌన్సిలర్ వినతి

అక్షరదర్బార్,పరకాల: పరకాల మున్సిపాలిటీలోని 9వ వార్డులో దామెర చెరువు మత్తడి కాల్వలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రపరచాలని కోరుతూ 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి గురువారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.రానున్న వర్షాకాలంలో చెరువు నిండి మత్తడి పడిన సమయంలో కాల్వలో నిల్వ ఉన్న చెత్త, మురుగు నీటి కారణంగా నీరు కలుషితమై ప్రజలకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. అందువల్ల ముందస్తుగా కాల్వను పూర్తిగా శుభ్రపరచాలని కోరారు.అలాగే వార్డులోని రోడ్లు, డ్రైనేజీలను కూడా శుభ్రపరిచి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 9వ వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన పనులను చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నరేష్, బుర్ర వెంకటేశ్వర్లు, మోతే సారంగపాణి, కుర్ర సురేష్ తదితరులు పాల్గొన్నారు.





# ఏరియా ఆసుపత్రిని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలి

○ ఆసుపత్రి నిర్వహణలో పారదర్శకత ఉండాలి

○ ఎమ్మెల్యే రేవూరి

○ అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సమీక్ష



అక్షరదర్బార్, పరకాల: పరకాలలో నూతనంగా నిర్మించిన 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని అత్యాధునిక వైద్య పరికరాలు, మెరుగైన మౌలిక వసతులతో త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యశ్రీ నిధులతో రూ.79.18 లక్షల వ్యయంతో వైద్య పరికరాల కొనుగోలు, అత్యవసర మందుల నిల్వలు, శస్త్రచికిత్సలకు అవసరమైన సదుపాయాలు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలో వైద్యుల సంఖ్య, రోగుల వివరాలు, ప్రసవాలు, శస్త్రచికిత్సలు, మందుల నిల్వలు, అవుట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్ల గణాంకాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన బిల్లులు, రికార్డులను పరిశీలించిన ఎమ్మెల్యే, వాటి నిర్వహణలో లోపాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు 24 గంటల పాటు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, వైద్యులు అందుబాటులో ఉండాలని సూచించారు. ముఖ్యంగా అనస్థీషియా వైద్యుడి సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని, అవసరమైన మందులను నిల్వ ఉంచాలని ఆదేశించారు. అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ఆసుపత్రిని త్వరలోనే వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ఆసుపత్రి నిర్వహణ, సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, ఆర్డీవో డి.ఎస్. వెంకన్న, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమ్ చౌహాన్, మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్ తదితరులు పాల్గొన్నారు.